రాసి దాన్ని 'దాసోహం'గా మార్చాడు. అది చూసి ఇందాకటి వాకర్ ఆ పదం అర్థం ఏమిటని అతన్ని అడిగాడు.

"దాసోహం అంటే ద్వైత మతం. ఉన్నది ఒక్క నారాయణుడే. మనం ఆయన సేవ చేసుకుంటేనే తరిస్తాం." వివరించాడు అతను.

అతను వెళ్ళగానే మళ్ళీ మొదటి సాధువు వచ్చి తను రాసిన దాని ముందు 'దా' చేర్చబడటం చూసి 'దా' ముందు 'స' అనే అక్షరాన్ని రాసి దాన్ని 'సదా సోహం'గా మార్చాడు. అతనెళ్ళాక రెండో సాధువు వచ్చి చూసి, భృకుటి ముడివేసి దాని ముందు 'దా' అనే అక్షరం రాసాడు. దాంతో అది 'దాస దాసోహం'గా మారింది. అతనెళ్ళాక మళ్ళీ మొదటి వాడు వచ్చి దాన్ని చూసి చిరాకు పడి 'స'ని చేర్చి దాన్ని 'సదా సదా సోహం'గా మార్చాడు. ఇలా సాయంత్రం దాకా మొదటి వాడు 'దా'ని, రెండోవాడు 'స' ని చేరుస్తూ ఆ గోడని నింపేసారు.

నీతి: ఎవరు నమ్మింది వారు ఆచరిస్తే చాలు తప్ప తాము ఆచరించేదే గొప్పదని ప్రచారం చేయడం మానుకోవాలి.

## 188. విజ్ఞత

దాన ధర్మాలు విరివిగా చేసే ఓ ధనవంతుడికి మరణ కాలం సమీపించింది. మరణ శయ్య మీద వున్న అతన్ని వైద్యుడు అతను ఆఖరుగా ఎవర్ని చూడాలనుకుంటున్నాడని అడిగాడు.

"పక్కింటి బీదవాడిని పిలిపించండి." కోరాడా ధనవంతుడు.

"అదేమిటి? మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకునే మీ భార్య, నిజాయితీ పరుడైన వ్యాపారంలోని మీ భాగస్వామి, లేదా మీ పిల్లలు కాక మిమ్మల్ని చేయి చాచి అడిగి, మీకు నష్టం కలిగించినతన్ని చూస్తానంటారేమిటి?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు డాక్టర్.

"ఇచ్చేవాడి కంటే పుచ్చుకునే వాడే గొప్ప. నేను మా వాళ్ళకిచ్చిందాని వల్ల ఇప్పుడు నాకు ఒరిగేదేమీ లేదు. నా నించి దానం పుచ్చుకున్న అతని వల్లే నేను విజ్ఞతగా పుణ్యాన్ని సంపాదించుకునే అవకాశం, తద్వారా ఉత్తమ గతి పొందే అవకాశం నాకు కలిగాయి. నాకా గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు కృతజ్ఞతగా నేను అతన్ని చూడాలనుకుంటున్నాను." జవాబు చెప్పాడా ధనవంతుడు.

## 189. చెడు-మంచి

హైద్రాబాద్‌లోని ఇద్దరు బ్రాహ్మణులకి ఆస్తమా వ్యాధి వుంది. చేపమందు తింటే ఆ రోగం నయం అవుతుందని వాళ్ళిద్దరూ విన్నారు. అయితే ఇద్దరూ పూర్తిగా శాకాహారులు. ఒకడు చేపని మింగడం విషయంలో సంశయించాడు. ఇంకొకడు తను ఇంకా క్షీణిస్తే తన మీద ఆధారపడ్డ భార్యా పిల్లలు ఇబ్బందికి గురవుతారని వెళ్ళి ఆ చేపమందుని మింగాడు. దాంతో అతని ఆస్తమా పోయింది.

పాపభీతి గల మొదటివాడు చేప మందుని తినకపోవడంతో ఆ రోగం అధికం అయి ఓ తెల్లవారుఝామున ఊపిరాడక మరణించాడు. అతని భార్యా పిల్లలు అనాధలై అనేక కష్టాలకి గురయ్యారు.

**నీతి:** మంచి పని కోసం కొంత చెడు చేయాల్సి వస్తే అది పాపం కాదు. కాని చెడు కోసం చేసే ప్రతీ మంచి పనీ పాపమే అవుతుంది.

## 190. ప్రవచన లక్ష్యం

ఓ గురువుకి ఒంట్లో బాగాలేకపోవడంతో అతని శిష్యుడు ఆ రోజు ఆయన బదులుగా ప్రవచనం చెప్పాల్సి వచ్చింది. అతను రాసుకున్న ప్రవచనం కాగితాన్ని గురువుకి ఇచ్చి అడిగాడు.

"ఏమైనా మార్పులు, చేర్పులు సూచిస్తారా?"